సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 21 । నవంబర్ । 2023



అర్జీలు రీ ఓపెన్ కాకూడదు

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 236 అర్జీలను జేసీ విశ్వనాథన్ స్వీకరించారు. 8లో



ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

సింహగిరిపై డిసెంబర్ 23న ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని నిర్వహించనున్నామని దేవస్థానం ఈవో తెలిపారు. 8లో



విశాఖకు టీ20 జట్లు 8లో

హార్బర్‌లో అలజడి

- చేపల రేవు చరిత్రలో అతి పెద్ద అగ్ని ప్రమాదం
- 'హుద్‌హుద్' తర్వాత మళ్లీ అంతటి భారీ నష్టం
- ప్రమాద తీవ్రతను పెంచిన ఈశాన్య గాలులు
- అర్ధరాత్రి రంగంలోకి దిగిన మత్స్యకార యువకులు
- ఇతర బోట్లు ప్రమాదానికి గురికాకుండా తరలింపు



ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమైన బోట్లు



దగ్ధమైన బోట్లు, సామగ్రి



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన బోట్లు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం తీవ్ర అలజడిని రేపింది. మునుపెన్నడూ లేనివిధంగా ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంతో విశాఖ ఉలిక్కి పడింది. ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ చేపలరేవులో అతి పెద్ద అగ్ని ప్రమాదం ఇదే. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే నగరంలోని మత్స్యకారులు పిల్లాపాపలతో హార్బర్‌కు పరుగులు తీశారు. అలా సోమవారం మధ్యాహ్నం వరకు వీరు చేపలరేవుకు వస్తూనే ఉన్నారు. మంటల్లో కాలిపోయిన బోట్లను చూసి బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తాము రూ.లక్షల్లో అప్పు చేసి బోట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు మంటల్లో కాలిపోయాయంటూ రోదించారు. ఇలా పెద్ద సంఖ్యలో వచ్చిన మత్స్యకారులతో పాటు అధికారులు, మీడియా ప్రతినిధులతో హార్బర్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. తొమ్మిదేళ్ల క్రితం సంభవించిన హుద్‌హుద్ తుపానుకు 60 బోట్లు మునిగిపోగా మరో 200కి పైగా బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ అగ్ని ప్రమాదంలో 36 బోట్లు పూర్తిగా, తొమ్మిది బోట్లు పాక్షికంగా కాలిపోయాయి. దాదాపు పది బోట్లలో దించకుండా ఉంచిన టన్నుల కొద్దీ చేపలూ దగ్ధమయ్యాయి.

అగ్నికి ఆజ్యం ఇలా..

హార్బర్‌లో అగ్ని ప్రమాదం తీవ్రతరం కావడానికి మరిన్ని ఆజ్యం పోశాయి. లంగరు వేసి ఉన్న అన్ని బోట్లలో వందల నుంచి వేల లీటర్ల డీజిల్ ఉంది. బోట్లను ఫైబర్‌తో తయారు చేస్తారు. బోట్లలో నైలాన్ వలలు ఉంటాయి. అలాగే బోట్లు రాపిడికి గురి కాకుండా ఇరుపక్కల పాత టైర్లను అమరుస్తారు. చేపలవేటకు వెళ్లినప్పుడు బోటులో కలాసీలు వంట చేసుకోవడానికి రెండేసి గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తుంటారు. ఇవి బోట్లలోనే ఉంచుతారు. అగ్ని ప్రమాదం తీవ్రత పెంచడానికి ఇవన్నీ దోహదపడ్డాయి. అంతేకాదు.. ప్రమాదం ఇతర బోట్లకు వేగంగా విస్తరించడానికి గాలులు కూడా తోడయ్యాయి. ప్రస్తుతం ఈశాన్య గాలులు బలంగా వీస్తున్నాయి. హార్బర్‌లోని జీరో జెట్టీ ఆరో నంబర్ షాపు ఎదురుగా లంగరేసిన బాలాజీ బోటులో మొదట అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడ నుంచి నిమిషాల్లోనే పక్కనున్న బోట్లకు మంటలు వ్యాపించాయి. ఈశాన్య గాలుల దాటికి పశ్చిమ, వాయవ్య దిక్కుల్లో లంగరేసిన బోట్లు కొన్ని ఒకటో నంబర్ జెట్టీలో ఉన్న బోట్ల వైపు వెళ్లిపోయాయి. దీంతో అక్కడున్న పలు బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి.

యువకుల సాహసం

అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న కొందరు మత్స్యకార యువకులు పరుగున హార్బర్‌కు చేరుకున్నారు. జెట్టీలకు కట్టిన తాళ్లను కోసివేసి బోట్లకు తాళ్లు కట్టి హార్బర్‌కు దూరంగా తీసుకెళ్లిపోయారు. దీంతో చాలా బోట్లను అగ్ని ప్రమాదం నుంచి కాపాడగలిగారు. లేదంటే మరిన్ని బోట్లు కాలిపోయి ఉండేవి.

ఇన్సూరెన్స్ లేదాయే..

మరోవైపు బోట్లకు ఏళ్ల తరబడి బీమా సదుపాయం లేదు. దీంతో ప్రమాదవశాత్తూ ఈ బోట్లు కాలిపోయినా, మునిగిపోయినా యజమానికి బీమా సొమ్ము రాదు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం వరకు వీటికి ఇన్స్యూరెన్స్‌కు వీలుండేది. అయితే దేశంలో కొంతమంది తప్పుడు క్లెయిమ్‌లకు పాల్పడుతున్నారని తేలడంతో కేంద్రం బోట్లకు బీమా సదుపాయాన్ని ఎత్తివేసింది. అప్పట్నుంచి బోట్లు ఇన్సూరెన్స్‌కు నోచుకోవడం లేదు. బీమా సదుపాయం ఉండి ఉంటే ఈ ప్రమాదంలో కాలిపోయిన బోట్లకు పరిహారం అందేదని మత్స్యకారులు చెబుతున్నారు.




రోదిస్తున్న మత్స్యకారులు, సొమ్మసిల్లిన మహిళ



హార్బర్ వద్ద గుమిగూడిన మత్స్యకారులు

సీఎంకి ధన్యవాదాలు



గత 20 ఏళ్ల నుంచి ఫిషింగ్ హార్బర్‌లో బోటు నడుపుతున్నాను. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. హార్బర్‌లో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరం. ఎవరో ఆకతాయిలు చేసిన పనికి ప్రభుత్వం స్పందించి సహాయం అందించింది. ఊహించిన దాని కన్నా ప్రభుత్వం ఎక్కువగానే సహాయం చేస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు.

– యాగ శ్రీనివాసరావు, బోటు యాజమాని, బోటు నంబర్ 585, ఫిషింగ్ హార్బర్

ఊపిరి పీల్చుకున్నా..



బోటు మీద వచ్చే ఆదాయంతోనే నా కుటుంబం జీవిస్తోంది. బోటు కాలిపోవడంతో రాత్రంతా నిద్ర లేదు. ఎలా జీవిస్తామన్న భయం కూడా వెంటాడింది. కాలిపోయిన బోటుకు 80 శాతం పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రకటించడం చాలా ఆనందం వేసింది. ఈ విషయం తెలిసి ఊపిరి పీల్చుకున్నాను. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు.

– పోలయ్య, బోటు యాజమాని, జాలారిపేట

20 బోట్లను తప్పించాం..



హార్బర్‌లో బోట్లు తగలబడుతున్నాయని కలాసీల నుంచి ఫోన్ వచ్చింది. టౌన్ కొత్త రోడ్డులో ఇంట్లో ఉన్న నేను వెంటనే అక్కడకు చేరుకున్నాను. కొంతమందితో కలిసి వేలంపాట జీరో జెట్టీలో లంగరేసిన బోట్ల తాళ్లను కట్ చేసి నా ఎంఎం–146 బోటుకు కట్టి దూరంగా తీసుకెళ్లాం. ఇలా 20 బోట్లు అగ్ని ప్రమాదం నుంచి తప్పించగలిగాం. మాకున్న నాలుగు బోట్లలో ఒకటి పూర్తిగా కాలిపోగా, మరొకటి పాక్షికంగా దెబ్బతింది.

– ఉమ్మడి సురేష్‌కుమార్, బోటు యజమాని కుమారుడు.

ఏడాది క్రితమే బోటు కొన్నాం..



మాది విజయనగరం జిల్లా చేపలకంచేరు. ఏడాది క్రితం రూ.60 లక్షలకు కొత్త బోటు కొన్నాను. ఇందులో సగం సొమ్ము ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పు చేశాను. నా బోటు ఎంఎం 851 ఆదివారమే వేటకెళ్లి వచ్చింది. దానిని జీరో జెట్టీలో లంగరేశాం. అందులో రూ.6 లక్షల విలువ చేసే చేపలను దించలేదు. రూ.3 లక్షల విలువైన మూడు వేల లీటర్ల డీజిల్ కూడా ఉంది. అగ్ని ప్రమాదంలో బోటు కాలిబూడిదైంది. ప్రభుత్వ పరిహారం అందితే గట్టెక్కుతాం.

– మైలపిల్లి అప్పలరాజు, బోటు యజమాని.

హుద్‌హుద్‌లోనూ దెబ్బతిన్నాం..



వేటాడి తెచ్చిన చేపలతో మా బోటు ఆదివారం ఉదయమే హార్బర్‌కు వచ్చింది. దానిని జీరో నంబరు జెట్టీలో లంగరేశారు. హుద్‌హుద్ తుపానులోనూ మా బోటు బాగా దెబ్బతింది. అప్పట్లో రూ.10 లక్షలతో మరమ్మతులు చేయించాం. దాని నుంచి తేరుకోక ముందే రూ.25 లక్షల విలువైన అదే బోటు ఇప్పుడు కాలి బూడిదైంది. అనారోగ్యంతో ఉన్న నా భర్తతో పాటు ముగ్గురు పిల్లలను పోషణకు ఈ బోటే ఆధారం. ఇప్పుడు నాకు దిక్కు తోచడం లేదు.

– కోనాడ అమ్మాజీ, బోటు యజమానురాలు

అండగా ఉంటాం.. ఆందోళన వద్దు



బాధిత మహిళలకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



మత్స్యకారులతో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున

- ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించిన మంత్రి అప్పలరాజు
- బోట్లను పరిశీలించిన ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే వాసుపల్లి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం ప్రాంతాన్ని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కోలా గురువులు, అధికారులు సందర్శించారు. కాలిపోయిన, మునిగిపోయిన బోట్లను పరిశీలించారు. బోట్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాద దుర్ఘటన దురదృష్టకరమన్నారు. దగ్ధమైన బోట్ల విలువ నష్టాన్ని అంచనా వేశాక ఆ మొత్తంలో 80 శాతం ప్రభుత్వం తక్షణమే పరిహారంగా చెల్లిస్తుందన్నారు.

బాధితులకు అండగా ఉంటా: ఎంపీ ఎంవీవీ

దగ్ధమైన మరబోట్లకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం నష్టపరిహారం ఇవ్వడం మంచి నిర్ణయమని విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మిలిగిన 20 శాతం కేంద్ర భరించాలని ప్రధానికి లేఖ రాస్తున్నట్టు వివరించారు. బాధితులకు సత్వర సహాయం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

సీఎం దృష్టికి తీసుకువెళ్లా : ఎమ్మెల్యే వాసుపల్లి

ఫిషింగ్ హార్బర్ చరిత్రలో ఇలాంటి ప్రమాదం జరగడం ఇదే మొదటిసారని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. గతంలో చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయని ఇంతనష్టం చోటుచేసుకోలేదన్నారు. సంఘటన జరిగిన తర్వాత తాను సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లానన్నారు. నష్టం జరిగిన దానిలో 80 శాతం ఇవ్వడం మంచి పరిణామం అన్నారు.

సీఎంకి ధన్యవాదాలు: కోలా గురువులు

బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. 80 శాతం పరిహారం ఇవ్వడం చాలా మంచి నిర్ణయమన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

80 శాతం పరిహారం భేష్ : పేర్ల

ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిన తీరు బాగుందని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్ అన్నారు. సంఘటన జరిగిన కొద్దిసేపటికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించి పలు శాఖలను అప్రమత్తం చేశారని తెలిపారు. ఆ తర్వాత మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును సంఘటన ప్రాంతానికి పంపించారన్నారు. 80 శాతం పరిహారం ఇవ్వడం మంచి నిర్ణయమన్నారు.

వివరాలు సేకరిస్తున్నాం : జేసీ విశ్వనాథన్

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన బోటు వివరాలు మత్స్యశాఖ నుంచి తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తెలిపారు. సోమవారం హార్బర్‌లో దగ్ధమైన బోట్లు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. బోటు ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలుసుకుంటున్నామన్నారు. లోపాల మీద కూడా ఆరా తీస్తున్నామన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు.

- టీడీపీ నాయకులు కొల్లు రవీంద్ర, బండారు సత్యనారాయణమూర్తి, గండి బాబ్జీ, ఎం.డి.నజీర్ తదితరులు మత్స్యకారులను పరామర్శించారు. వారికి న్యాయం చేయాలని కోరారు. జనసేన నాయకులు పంచకర్ల రమేష్‌బాబు, కోన తాతారావు బాధితులను ఓదార్చి వారికి న్యాయం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకట లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోండా శ్రీనివాసరావు, వాడమోదుల గణేష్, ఇతర నాయకులు సంఘటన స్థలాన్ని సందర్శించారు.

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న వీవీఎస్ లక్ష్మణ్



ఆశీర్వచనం అందుకుంటున్న వీవీఎస్ లక్ష్మణ్ దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం భారత క్రికెట్ జట్టు మాజీ సభ్యుడు వి.వి.ఎస్.లక్ష్మణ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

26 నుంచి నృసింహ దీక్షలు

సింహాచలం: ఈనెల 26 నుంచి 41 రోజుల నృసింహ దీక్షలు, డిసెంబరు 4వ తేదీ నుంచి 32రోజుల నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనిసాసమూర్తి ప్రకటించారు. ఈ ఏడాది దేవస్థానం వైదికులు సూచించిన ప్రకారం దీక్షా తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. పై తేదీల్లో సింహగిరిపై శాస్త్రోక్తంగా మాలధారణ ఉంటుందని, దేవస్థానం తరపు నుంచి స్వామివారి తులసిమాల, ప్రతిమ ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6న రెండు దీక్షల విరమణ ఉంటుందన్నారు.

23,27 తేదీల్లో రాత్రి 7 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఈనెల 23, 27 తేదీల్లో రాత్రి ఏడు గంటల వరకే లభిస్తాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 23న కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని రాత్రి కైశిక పురాణ విన్నపం, తిరువీధి ఉంటాయన్నారు. అలాగే 27న కార్తీక పౌర్ణమిని సందర్భంగా వృశ్చిక దీపారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. పై రెండు తేదీల్లో రాత్రి ఆరాధన టిక్కెట్లు కూడా రద్దు చేసినట్లు తెలిపారు.

మెడికల్ కళాశాలకు శర్మ భౌతికకాయం



ఎ.ఎస్.ఎస్.ఎన్. శర్మ (ఫైల్)

తగరపువలస: నగరంలోని ఎండాడకు చెందిన 86 ఏళ్ల విశ్రాంత ఇరిగేషన్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎస్.ఎన్.శర్మ భౌతికాయాన్ని అతని కుటుంబ సభ్యులు సోమవారం సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ సైన్సెస్‌కు అందించారు. అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు సీతామహలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం... తమ సంఘంలో సీనియర్ సభ్యుడైన శర్మ ఆదివారం రాత్రి ఎండాడలోని ఆయన కుమారుడు శ్రీనివాస్ ఇంట్లో మృతి చెందారన్నారు. ఆయన అంతిమ కోరిక మేరకు మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని అందించామన్నారు. శర్మ భౌతికకాయాన్ని మెడికల్, డెంటల్ విద్యార్థులకు శిక్షణ నిమిత్తం అనాటమీ విభాగంలో భద్రపరిచినట్టు కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ తెలిపారు.

రేపటి నుంచి రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



పోస్టర్ విడుదల చేస్తున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 22వ తేదీ నుంచి రైల్వే స్టేడియం ప్రాంగణంలో జరగనుంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే, సదరన్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, సౌత్‌సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే, సెంట్రల్ రైల్వేతో పాటు సౌత్ ఈస్టర్న్ రైల్వే జట్లు పోటీపడనున్నాయి. మూడురోజుల పాటు ఏడు బృందాలు తలపడనున్న ఈ పోటీల పోస్టర్‌ను డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ సోమవారం విడుదల చేశారు.

మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా కబడ్డీ జట్టును గురువారం ఎంపిక చేయనున్నారు. గాజువాక బీసీ రోడ్ కబడ్డీ గ్రౌండ్స్‌లో 75 కేజీల బరువులోపు ఉన్న మహిళలు ఎంపికల్లో పాల్గొనవచ్చు. ఎంపికైన క్రీడాకారిణులు 29 నుంచి కర్నూలు జిల్లాలో జరిగే సీనియర్ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అర్హులని నిర్వాహకులు తెలిపారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు ప్రభుత్వం భరోసా

- నిర్వాసితులకు పూర్తిగా నష్టపరిహారం
- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- అండగా ఉంటామన్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి , జీవీఎంసీ కమిషనర్

మహారాణిపేట: సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించడంతో పాటు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావులతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో నష్టపోయిన కుటుంబాలకు పూర్తి పరిహారం చెల్లించడంతో పాటు టీడీఆర్ ఇస్తామన్నారు. అడవివరం సచివాలయంలో మంగళవారం నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 276 మంది బాధితులను గుర్తించామని, వారిలో 125 మందికి ఇప్పటికే నష్టపరిహారం చెల్లించామన్నారు. మిగిలిన వారికి వచ్చే నెల ఒకటో తేదీ నాటికి చెల్లిస్తామని కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. అదే విధంగా బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో 346 ఆస్తులు గుర్తించామని, వాటిలో 55 టీడీఆర్ చెల్లించామన్నారు. మరో 291 ఆస్తులను ఆమోదించాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం కోర్టులో ఉన్న విషయాలను మినహాయించి విస్తరణలో సగం ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు ఇళ్ల మరమ్మతులకు అనుమతిస్తామన్నారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి జగనన్న ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బాధితులకు ఎలాంటి అన్యాయం జరగదన్నారు. బాధితులందరికీ న్యాయం జరుగుతుందని, దీనిపై ఎలాంటి అనుమానాలు వద్దని సూచించారు. కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇలాంటివి నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ బాధితులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ బాధితుల కోసం హెల్ప్‌డెస్క్

డాబాగార్డెన్స్: నిర్వాసితుల సౌకర్యార్థం అభ్యర్థనలు స్వీకరించేందుకు నష్ట పరిహార కేంద్రం (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులోగల ఇందిరా ప్రియదర్శిని కల్యాణ మండపంలో నష్టపరిహార కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్ డెస్క్‌లో జోన్–8 ఏసీపీ/టీపీవో ఈ నెల 27వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. బాధితులు తమ అభ్యర్థనలు, అభ్యంతరాలు, సలహాలు సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన బోట్ల వివరాలు



బోటు యజమాని పేరు	బోటు నంబరు
వాసుపల్లి అప్పన్న	ఎంఎం 524
వంకా గురుమూర్తి	ఎంఎం 788
వై.శ్రీనివాసరావు	ఎంఎం 585
మైలపల్లి అప్పలరాజు	ఎంఎం 851
మైలపల్లి చిన్నయ్య	ఎంఎం 167
వాసుపల్లి సత్తిబాబు	ఎంఎం 437
బడే అప్పన్న	ఎంఎం 481
గనగళ్ల నరసింహులు	ఎంఎం 407
వాసుపల్లి యల్లమ్మ	ఎంఎం 836
కేశం నూకాలు	ఎంఎం 445
కారి రామారావు	ఎంఎం 624
పుక్కళ్ల శివశంకర్	ఎంఎం 948
శీరం రామారావు	ఎంఎం 789
బొడ్డు యల్లాజీ	ఎంఎం 691
మైలపిల్లి గురుజీ	ఎంఎం 229
మైలపిల్లి యల్లారావు	ఎంఎం 231
పిరాది దుర్గాప్రసాద్	ఎంఎం 600
శీరం వరలక్ష్మి	ఎంఎం 667
గరికిన కొండ	ఎంఎం 795
బొడ్డు రామన్న	ఎంఎం 71
అర్జిల్లి అమ్మోరమ్మ	ఎంఎం 302
మైలపిల్లి యల్లాజీ	ఎంఎం 760
మైలపిల్లి పాపారావు	ఎంఎం 839
అల్లిపిల్లి వెంకటేష్	ఎంఎం 887
గరికిన అప్పలకొండ	ఎంఎం 336
అల్లిపిల్లి గవరయ్య	ఎంఎం 06
కొమర రమేష్	వీఐ 2539
అర్జిల్లి చిన్ననాయుడు	ఎంఎం 642
గనగళ్ల కొర్లతల్లి	ఎంఎం 522
కారివలస లచ్చ	ఎంఎం 798
గనగళ్ల పెంటయ్య	ఎంఎం 390
కారి పోలయ్య	ఎంఎం 746
గనగళ్ల గరగయ్య	ఎంఎం 480
గనగళ్ల అప్పయమ్మ	ఎంఎం 17
గనగళ్ల పోలరాజు	ఎంఎం 404
గరికిన దానయమ్మ	ఎంఎం 222
మైలపిల్లి లక్ష్మయ్య	ఎంఎం 909
కాసారపు కృష్ణవేణి	ఎంఎం 434
సురపతి నరేష్	ఎంఎం 688
మైలపిల్లి యల్లాజీ	ఎంఎం 593
కోనాడ అమ్మాజీ	ఎంఎం 590
ఉమ్మిడి ఎర్రయ్య	ఎంఎం 419
ఎం. సీతారామ్	ఎంఎం 815
కె.సత్యమూర్తి	ఎంఎం 12
వై. ధనరాజు	ఎంఎం 894

పోలీసు సిబ్బందికి సీపీ అభినందనలు



ఎస్‌ఐ కొండను అభినందిస్తున్న సీపీ రవిశంకర్

అల్లిపురం: ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదంపై సకాలంలో స్పందించి, ఆస్తి నష్టం జరగకుండా విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బందిని పోలీస్ పోలీస్ కమిషనర్ రవిశంకర్ అభినందించి, రివార్డులు అందజేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం బీట్ గస్తీ తిరుగుతున్న హెడ్ కానిస్టేబుల్ జి.నాగేంద్రకుమార్, కానిస్టేబుల్ వీజీజీబీ రామకృష్ణలు ఫిషింగ్ హార్బర్‌లో పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందజేయగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ ఆర్.ఎ.కొండ, కానిస్టేబుల్ సీహెచ్.గంగాధర్‌లు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. వెంటనే ఐదు అగ్నిమాపక శకటాలు, కోరమాండల్, పోర్టు, నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు సమాచారం అందజేయటంతో సకాలంలో చేరుకుని మంటలను అదుపుచేయటంతో ఆస్తి నష్టం తగ్గింది. విధుల్లో చాకచక్యంగా వ్యవహరించిన వీరిని సీపీ అభినందించారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని వుడా మైదానంలో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి అండర్ – 14 అంతర జిల్లా బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమవుతాయని విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో 13 జిల్లాల నుంచి 468 మంది బాల, బాలికలు పాల్గొంటున్నారని, పోటీలు అమేయా ఇంటర్నేషన్ స్కూల్ వద్ద జరుగుతాయన్నారు.

రీ ఓపెన్ అర్జీలపై దృష్టి సారించండి

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ద్వారా అర్జీదారులు సంతృప్తి పడాలని, ఈ విషయంలో అధికారులు రాజీ పడొద్దని సూచించారు. బాధితులు సంతృప్తి చెందకపోవడం వల్ల అర్జీలు రీఓపెన్ అవుతున్నాయన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలకు 24 గంటల నుంచి నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఆదివారం నాటికి ఎటువంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పూర్తి డేటాతో సోమవారం నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 236 వినతులు అందగా..రెవెన్యూశాఖకు 98, జీవీఎంసీకి 59, పోలీసు శాఖకు 16, ఇతర శాఖలకు 63 వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సెన్ సాహెబ్, పోలీసు, మునిసిపల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సింహగిరిపై వచ్చే నెల 23న ముక్కోటి ఏకాదశి

వైకుంఠద్వార దర్శనం ఏర్పాట్లపై సమీక్ష

సింహాచలం : సింహగిరిపై డిసెంబర్ 23న ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి తరలి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ముక్కోటి ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో ఈవో ముందస్తు సమావేశం నిర్వహించారు. చేయాల్సిన ఏర్పాట్లపై విభాగాల వారీగా చర్చించారు. ఆ రోజు నిర్వహించాల్సిన వైదిక కార్యక్రమాలు, దర్శనాల సమయాలు, పుష్పాలంకరణ, క్యూలైన్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత ప్రసాదాల వితరణ, వేదిక ఏర్పాటు, అన్నదానం, భక్తుల దర్శనాలు, వీఐపీల దర్శనాలు, విద్యుత్ అలంకరణ, మంచినీటి సరఫరా, రవాణా సదుపాయం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, వైద్య శిబిరాలు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ముక్కోటి ఏకాదశిని విజయవంతం చేస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సుజాత, ఎస్‌డీసీ రామలక్ష్మి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

సకాలంలో వినతులకు పరిష్కారం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్)కు వినతులు వెల్లువెత్తాయి. వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాల నుంచి 100 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఫిర్యాదులు పరిశీలించి 3 రోజుల్లో లేదా నిర్ణీత సమయంలో ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి సన్యాసిరావు, సీసీపీ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేషకుమార్, హార్టికల్చర్ దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యదర్శి పి నల్లనయ్య పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇలా..

ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి జోన్–3 పరిధి లాసన్స్‌బే కాలనీతో పాటు పాలు ప్రాంతాల్లో ఓపెన్ డ్రైన్లు మరమ్మతులు చేపట్టాలని చల్లా సత్యనారాయణ మూర్తి ఫిర్యాదుచేశారు. జోన్–3 పరిధి ఎంవీపీ కాలనీలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరుగుతున్నాయని మరడా అప్పలరెడ్డి ఫిర్యాదు చేయగా..జోన్–2 పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని నకిరెడ్డి సావిత్రి ఫిర్యాదు చేశారు. జోన్–5 పరిధిలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని గుడివాడ అప్పారావు, జోన్–5 పరిధిలో ఓపెన్ డ్రెయిన్లు మరమ్మతులు చేపట్టాలని డి శంకర్రావు, జోన్–8 పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు వ్యతిరేకంగా కట్టడాలు జరుగుతున్నాయని గంట్రెడ్డి కొండలరావు ఫిర్యాదు చేశారు.

పోలీసు స్పందనకు 61 వినతలు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏడీసీపీ(అడ్మిన్) రాజు

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీ లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు

ఆనందపురం : మండలంలోని బోయిపాలెంలో గల ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి విజయలక్ష్మి ముద్దాయిలకు సోమవారం జైలు శిక్ష, జరిమానా విధించారు. క్రైమ్ ఎస్ఐ మన్మథ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ప్రైవేట్ పాఠశాలలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న కొల్లి అప్పారావు ఇంట్లో 2021 జూన్ 1న దొంగలు చొరబడి బంగారు ఆభరణాలు, ఫోన్ దొంగిలించుకుపోయారు. ఈ మేరకు అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు నగరంలోని పూర్ణామార్కెట్ ప్రాంతంలోని కల్లు పాకలకు చెందిన లావేటి దుర్గారావు (23), మావన్న హరి (28)ని నిందితులుగా గుర్తించారు. వారిపై ఛార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరు పరిచగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి నాలుగు నెలలు జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధించారు. కాగా ముద్దాయిలలో ఒకరైన మావన్న హరి తనకు వివాహ కార్యక్రమం ఉందని న్యాయమూర్తికి విన్నవించుకోగా... అందుకు సమ్మతించి పీవో ఆక్ట్ కింద హరిని విడిచి పెట్టారు. అతని నడవడికను ఏడాదిపాటు గమనించాలని, మరలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే కోర్టు వారికి తెలియజేయాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు.

అల్లుడే కాలయముడు

- చినముషిడివాడలో అత్తను హతమార్చిన వైనం
- భార్యతో విడాకుల అంశంపై తరచూ వివాదాలు


నిందితుడు సన్యాసినాయుడు


మృతి చెందిన లక్ష్మి

పెందుర్తి: అల్లుడే ఆమె పాలిట యముడయ్యాడు. తోడబుట్టిన తమ్ముడే ఆమె ప్రాణాలు తీశాడు..భార్యతో విడాకుల అంశంపై గొడవ పడి అత్తను హతమార్చిన ఘటన సోమవారం చినముషిడివాడలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. చినముషిడివాడ గణేష్‌నగర్‌కు చెందిన దొగ్గ లక్ష్మి (65)కి ముగ్గురు కుమార్తెలు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం వసంతలో నివాసం ఉంటున్న తన సోదరుడు కె.సన్యాసినాయుడుకి పెద్ద కుమార్తె ప్రత్యూషను ఇచ్చి 15 ఏళ్ల క్రితం వివాహం చేసింది. సన్యాసినాయుడు సబ్బవరం గురుకులంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. అయితే నాలుగైదు ఏళ్లుగా సన్యాసినాయుడు, ప్రత్యూషకు మధ్య గొడవలు జరగడంతో విడాకుల ప్రతిపాదన వచ్చింది. దీనిపై సన్యాసినాయుడు చినముషిడివాడలోని అత్తింటికి వచ్చి గొడవ పడుతుండేవాడు. గతంలో లక్ష్మి భర్తపై కూడా దాడి చేయగా..పోలీసు కేసు నమోదైంది. ఈ క్రమంలో కొద్దిరోజులుగా అత్తింట్లోనే మకాం వేసిన సన్యాసినాయుడు సోమవారం సాయంత్రం అత్త (అక్క)తో మరోసారి గొడవకు దిగాడు. ఆ సమయంలో తీవ్ర ఆగ్రహానికి గురైన సన్యాసినాయుడు లక్ష్మిని గోడకు గట్టిగా మోదడంతో స్పృహ తప్పి కింద పడిపోయింది. తీవ్ర గాయంతో అక్కడికక్కడే మరణించింది. దీంతో వెంటనే స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు సన్యాసినాయుడుని అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ చేరుకున్న భారత్,ఆస్ట్రేలియా టీ-20 జట్లు


రాడిసన్ బ్లూ హోటల్‌లో జితేష్‌తో రింక్


హోటల్‌కు చేరుకున్న తిలక్

విశాఖ స్పోర్ట్స్ : భారత్–ఆస్ట్రేలియా మధ్య ఈనెల 23 నుంచి టీ–20 మ్యాచ్ జరగనుంది. తొలి మ్యాచ్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏవీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఇరు జట్లు సోమవారం విశాఖ చేరుకున్నాయి. రాడిసన్ బ్లూ హోటల్‌లో భారత్ ఆటగాళ్లు సేద తీరగా... ఆసీస్ ఆటగాళ్లు సోమవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు. ఆసియన్ గేమ్స్‌లో ఆడిన క్రీడాకారులే భారత్ తరుపున ఆడనున్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దుకు పోరాటం


మాట్లాడుతున్న పీకే పట్నహాని, చిత్రంలో ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్‌యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ రద్దు కోరుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాటాలను మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించినట్లు ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ జనరల్ సెక్రటరీ పీకే పట్నహాని తెలిపారు. దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం వెనుక గల ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ముంబైలో జరిగిన 99వ జాతీయ మహాసభలో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఎన్‌పిఎస్‌రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా రైల్వే కార్మికులు సమ్మె చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ నెల 21,22తేదీలలో స్ట్రైక్ బ్యాలట్ ద్వారా కార్మికుల అభిప్రాయాలను సేకరించి వారిని సమ్మెకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ ఆర్‌వీఎస్ఎస్ రావు, డివిజనల్ కో ఆర్డినేటర్ పీవీజీ రాజు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ పీఆర్ఎం రావు, పి.ఆదినారాయణ, మాజీ జోనల్ అధ్యక్షుడు బి. దామోదరరావు పాల్గొన్నారు.

3న కాపు యూత్ వన సమారాధన


కార్తీక వన సమారాధన పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: విశాఖ కాపు యూత్ కార్తీక వన సమారాధన డిసెంబర్ 3న ముడసర్లోవ పార్క్‌లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాపు, తూర్పు కాపు, తెలగ, బలిజ, మున్నూరు కాపు కులాలకు చెందిన వారి కోసం వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ మాట్లాడుతూ పదేళ్లుగా వనసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ప్రవేశం ఉచితమని, వన సమారాధనతో పాటు మ్యారేజ్ బ్యూరో కూడా ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో గొల్లకోట సుబ్బారావు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, బలిరెడ్డి సుహాస్, సూదాబత్తుల సత్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

పలువురు న్యాయమూర్తులకు పదోన్నతి, బదిలీ

సాక్షి, విశాఖపట్నం: హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు న్యాయమూర్తులకు పదోన్నతులు కల్పిస్తూ బదిలీ చేసింది. విశాఖకు చెందిన పలువురు న్యాయమూర్తులకు బదిలీ అయింది. భీమునిపట్నం రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి కమ్ ఏడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ విధులు నిర్వర్తిస్తున్న సిహెచ్ పవన్‌కుమార్ పదోన్నతిపై విశాఖలో రెండో అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా వస్తున్నారు. రెండో అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఉన్న సిహెచ్ వివేక్ ఆనంద్‌శ్రీనివాస్ విశాఖలోనే ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. విశాఖ ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.శివశంకరరెడి ప్రకాశం జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా, పొదిలి జూనియర్ సివిల్ న్యాయమూర్తి వి.పావని పదోన్నతిపై గాజువాక మూడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా వస్తున్నారు. గాజువాక మూడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రబాబు, గాజువాకలోనే సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి విశాఖలోని రెండో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా పదోన్నతిపై విశాఖ వస్తున్నారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న న్యాయమూర్తి కె.వి.ఎల్ హిమబిందు విశాఖలోనే ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా బదిలీ అయ్యారు.

నగరంలో నేడు

- ఉదయం9 గంటలకు ఫిషింగ్ హార్బర్‌లో బోటు ప్రమాద బాధితులకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పరామర్శిస్తారు.
- ఉదయం 9:30 గంటలకు హోటల్ నోవాటెల్‌లో పోర్ట్స్ అండ్ మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టేషన్ 2023పై సీఐఐ సదస్సు.
- 10 గంటలకు ఫిషింగ్ హార్బర్‌లో బాధితులకు ఎంపీ జీవీఎల్ పరామర్శ.